

రామారెడ్డిలో సొసైటీ వద్ద జీలుగ విత్తనాలకు బారులు తీరిన రైతులు

# వీసీగా వచ్చేదెవరో ?



- త్వరలోనే సెర్చ్ కమిటీ సమావేశం
- ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ సుల్తానియా

డిచ్‌పల్లి, మే 21: తెలంగాణ విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్స్‌లర్ ఎంపికపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. సుమారు ఏడాది కాలంగా ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు వీసీలను నియమించేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ విశ్వవిద్యాలయానికి వీసీ పోస్టుకోసం 159మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 133మంది ప్రస్తుతం సెర్చ్ కమిటీ ఎంపిక చేసే జాబితాలో ఉన్నారు. దాదాపు ఈ నెలాఖరులోగా వీసీ ఎంపిక పూర్తయ్యే అవకాశమున్నది.

**అవకాశం ఎవరికి దక్కేనో?**

విశ్వవిద్యాలయానికి చెందిన ఏడుగురు ప్రొఫెసర్లు వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రొఫెసర్ కనకయ్య, విద్యావర్ధిని, నసీం, ప్రస్తుత సీవోఈ ప్రొఫెసర్ అరుణ, కైసర్ మహ్మద్ తదితరులు ఉన్నారు. వీరే కాకుండా ఉస్మానియా యూనివర్సిటీలోని విద్యారంగానికి చెందిన ప్రొఫెసర్ ప్రసాద్‌తోపాటు మరో ప్రొఫెసర్ కృష్ణారావు కూడా ఉన్నట్లు తెలిసింది. వీరిలో ప్రొఫెసర్ ప్రసాద్ వేల్పూర్‌కు చెందిన వాస్తవ్యుడు కావడంతో ఆయనకు అవకాశమున్నట్లు వినికిడి. కాకతీయ యూనివర్సిటీ నుంచి కూడా మరో ముగ్గురు ప్రొఫెసర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

**జూన్ 7 తర్వాతే పూర్తిస్థాయి వీసీ నియామకం..**

రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు వీసీల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీ అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్నది. ముగ్గురు సభ్యులతో కూడిన తుది జాబితా కోసం వడపోస్తున్నారు. ఈ అంకం దాదాపు చివరి దశలో ఉన్నది. అనంతరం ముగ్గురు సభ్యులతో కూడిన జాబితాను గవర్నర్‌కు కమిటీ పంపనున్నది. వీరిలో నుంచి ఫైనల్‌గా ఒకరిని ఎంపిక చేయనున్నారు. ఎన్నికల కోడ్ కొనసాగుతుండడంతో ఈ ప్రక్రియ కాస్త ఆలస్యం కానున్నది. మొదట అనుకున్నట్లుగా ఈనెల 27లోగా వీసీల ఎంపిక ప్రక్రియను మొత్తం పూర్తి చేయనున్నట్లు తెలిసింది. కానీ కేంద్ర ఎన్నికల సంఘం వచ్చే నెల 6న ఎన్నికల కోడ్‌ను ఎత్తివేయనున్నది. 7న రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు పూర్తిస్థాయి వీసీలను ప్రకటించనున్నట్లు తెలిసింది.

**ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ సుల్తానియా**

**– ఎన్నికల కోడ్ ముగిశాకే పూర్తిస్థాయి వీసీ వచ్చే అవకాశం**

తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జీ వీసీగా సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాను ప్రభుత్వం మంగళవారం నియమించింది. రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా పనిచేస్తున్న సందీప్‌కుమార్‌ను టీయూ వీసీ బాధ్యతలు అప్పగించింది. రెగ్యులర్ వీసీ వచ్చే వరకు ఇన్‌చార్జీగా కొనసాగనున్నారు. ఇదిలా ఉండగా సందీప్‌కుమార్ సుల్తానియా గతంలో జిల్లాలో నీరు–మీరు పీడీగా పనిచేశారు.

- అత్యధిక కాలం ఇన్‌చార్జీల పాలనలోనే..
- తాజాగా సీనియర్ ఐఏఎస్ సుల్తానియాకు బాధ్యతలు
- ఎన్నికల కోడ్ తర్వాత పూర్తిస్థాయి వీసీ
- పగటి కలగానే విశ్వవిద్యాలయ ప్రక్షాళన

తెలంగాణ వర్సిటీ గాడిలో పడేదెన్నడు?

# ఇన్‌చార్జీలే దిక్కు

నిజామాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ విశ్వవిద్యాలయం తొలి నుంచి ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నది. తాజాగా యూనివర్సిటీకి మరోసారి సీనియర్ ఐఏఎస్ అధికారి ఇన్‌చార్జ్ వీసీగా నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల బాధ్యతలను ఐఏఎస్‌లకు అప్పగించిన ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీగా సందీప్‌కుమార్ సుల్తానియాను నియమించింది. ఆవిర్భావం నుంచి అత్యధిక కాలం ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్న ఈ వర్సిటీ వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ క్రమంలోనే విశ్వవిద్యాలయ ప్రక్షాళన పగటి కలగానే మారింది. పూర్తి స్థాయి వీసీ లేకపోవడంతో వర్సిటీలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా బోధన, బోధనేతర సిబ్బంది వ్యవహరిస్తున్నారు. పూర్తి కాలపు వీసీగా వచ్చిన ప్రొఫెసర్ రవీందర్ గుప్తా తీరుతో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వర్సిటీ పరువు పోయింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన రవీందర్ గుప్తాను వీసీ బాధ్యతల నుంచి తొలగించారు. ఆ తర్వాత ఇద్దరు ఐఏఎస్‌లు వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేక పోయారు. దీంతో రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొ.యాదగిరి ఒక్కరే అన్ని బాధ్యతలను చూస్తుండటం విమర్శలకు తావిచ్చింది. పైగా బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకోక మీనమేషాలు లెక్కించడం వంటి ఘటనలు టీయూ ప్రతిష్టను దిగజార్చాయి.

**18 ఏండ్లు.. 15 మంది వీసీలు..**

2006 జూన్ 18న ఆవిర్భవించిన తెలంగాణ యూనివర్సిటీకి ఆది నుంచి ఇన్‌చార్జీలే దిక్కయ్యారు. వర్సిటీ ఆవిర్భావ సమయంలో తొలి వీసీగా ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖి మూడు నెలల పాటు ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ప్రొఫెసర్ సులోచనారెడ్డి నాలుగు నెలలు పని చేశారు. 2006 నవంబర్ 6న పూర్తి స్థాయి వీసీగా నియమితులైన ప్రొ.కాశీరామ్ 2009 నవంబర్ 3 వరకు పని చేశారు. అత్యధిక కాలం వీసీగా ఉన్న ఆయన వర్సిటీని గాడిలో పెట్టారు. ఆ తర్వాత ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి ఏడాది పాటు, ఓయూకు చెందిన ప్రొఫెసర్ తిరుపతిరావు మూడు నెలలు, ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి ఆర్నెళ్లు ఇన్‌చార్జీ వీసీలుగా పని చేశారు. 2011 జూలై 15న పూర్తి స్థాయి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ అక్బర్ అలీఖాన్ 2014 జూలై 14 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తర్వాత ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ ఆర్నెళ్లు, ఐఏఎస్ అధికారి పార్థసారథి రెండేండ్లపాటు ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించారు.

**పూటకొకరు..**

2016 జూలై 25న శాశ్వత వీసీగా నియమితులైన ప్రొ.సాంబయ్య 2019 జూలై 24న పదవీ విరమణ చేశారు. తర్వాత ఐఏఎస్ అధికారి వి.అనిల్ కుమార్ ఆర్నెళ్లు, నీతూకుమారి ప్రసాత్ ఏడాదిన్నర పాటు బాధ్యతలు నిర్వర్తించారు. 2021 మే 22న పూర్తి స్థాయి వీసీగా నియమితులైన ప్రొ.రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో ప్రభుత్వం ఆయనను తప్పించింది. 2022 జూలై 13 నుంచి ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ, ఆ తర్వాత బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా కొనసాగారు. తాజాగా మరో సీనియర్ ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియా ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు. వర్సిటీ ఆవిర్భావం నుంచి 18 ఏళ్లలో 15 మంది వీసీలు పని చేస్తే ఇందులో ఏడుగురు ఇన్‌చార్జీలే కావడం గమనార్హం. వీరి ఆధ్వర్యంలోనూ ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ఐఏఎస్ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో టీయూ పరిస్థితి గందరగోళంగా మారింది.

**తప్పు చేసిన వారిపై చర్యలేవి..?**

తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటే వేరు వారు ఆ తప్పు చేసేందుకు భయపడుతారు. కానీ వర్సిటీలో అలాంటి పరిస్థితి లేనే లేదు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమాలకు పాల్పడే వారిదే ఇక్కడ రాజ్యం అన్నట్లుగా ఉంది. అలాంటి వారికే వీసీలు, రిజిస్ట్రార్‌లు వంత పాడుతుండటంతో బోధన, బోధనేతర సిబ్బందిలో క్రమశిక్షణ లోపించింది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొంత మంది ఆచార్యులైతే క్లాస్ రూముల్లో నీతులు బోధిస్తూనే... నిజ వ్యవహారాల్లో మాత్రం తప్పటడుగులు వేస్తూ నవ్వుల పాలవుతున్నారు. కొంత మంది ఆచార్యులు నెలల తరబడి వర్సిటీకి రాకుండానే జీతాలు తీసుకుంటున్న వైనం విస్మయం కలిగిస్తున్నది. వీరికి జీతాల బిల్లులను మంజూరు చేస్తూ కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్న సిబ్బంది కూడా తప్పుల మీద తప్పులు చేస్తున్నారు. అక్రమ నియామకాలు, కాంట్రాక్టు పనుల్లో ఇష్టారాజ్యం, నిబంధనలకు విరుద్ధంగా పనుల అప్పగింత, పరీక్షల విభాగంలో నిర్లిప్తత, పరిపాలనలో అలసత్వం వెరసి వర్సిటీని భ్రష్టు పట్టించాయి. ఇలాంటి దుస్థితిలో ఇన్‌చార్జి వీసీగా నియమితులైన సందీప్‌కుమార్ సుల్తానియా ఆధ్వర్యంలోనైనా టీయూ గాడిలో పడాలని విద్యార్థులు ఆశిస్తున్నారు.




# జీలుగ గోస

- బారులుతీరిన రైతులు
- సరిపడా విత్తనాలు పంపని ప్రభుత్వం
- మార్పు వచ్చిందని రైతుల సెటైర్లు

రామారెడ్డి, మే 21: రామారెడ్డి మండల కేంద్రంలోని సొసైటీ వద్ద జీలుగ విత్తనాల కోసం రైతులు బారులు తీరారు. ఉదయం 6 గంటలకే సొసైటీకి చేరుకొని క్యూలో నిల్చున్నారు. మండలంలో దాదాపు 10వేల మంది రైతులుండగా కేవలం 666 బ్యాగులు మాత్రమే వచ్చాయి. విత్తనాల పంపిణీ విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొంతమందికి మాత్రమే జీలుగ విత్తనాలు లభించడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగారు. గత ప్రభుత్వ హయాంలో మే నెల మొదటి వారంలోనే సరిపడా విత్తనాలను సరఫరా చేసేవారని రైతులు గుర్తుచేశారు. విత్తనాల కొరతపై మండల వ్యవసాయాధికారి హరీశ్‌కుమార్‌ను వివరణ కోరగా తాము 500 క్వింటాళ్ల జీలుగ, 100 క్వింటాళ్ల పెద్ద జనుము విత్తనాలు పంపించాలని కోరామని, విడుతల వారీగా వస్తాయని ఉన్నతాధికారులు తెలిపినట్లు చెప్పారు. సర్కారు మారింది.. పెద్ద మార్పే వచ్చిందని పలువురు అన్నదాతలు సెటైర్లు వేయడం కనిపించింది.

# డెంగీతో బాలుడు మృతి

ఎల్లారెడ్డి రూరల్, మే 21: ఆడుతూ పాడుతూ తిరుగుతున్న బాలుడు డెంగీ సోకి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ప్యాలాల కృష్ణ కుమారుడైన మణిదీప్(10)కు డెంగీ వ్యాధి సోకడంతో 20రోజుల క్రితం హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో చేర్పించారు. 20రోజులుగా డెంగీ సమస్యతో పోరాడుతున్న మణిదీప్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. అందరితో చలాకీగా ఉండే మణిదీప్ మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.


మణిదీప్ (ఫైల్)

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.15.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి,మే 21 : కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని గోదాముల నుంచి భారీ మొత్తంలో సిగరెట్లు చోరీ చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుల కోసం 15రోజుల నుంచి సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని, సాంకేతికత ఆధారంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో నివాసం ఉంటున్న కుమావత్ మందారం, హైదరాబాద్‌లో నివాసముంటున్న కుమావత్ లక్ష్మణ్‌లను పట్టుకోగా, మరో నిందితుడు కుమావత్ ఘన్‌శ్యాం పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరంతా రాజస్థాన్‌వాసులని వివరించారు. నిందితుల నుంచి రూ.8 లక్షల నగదుతోపాటు బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.7.50 లక్షలు, స్విఫ్ట్‌కారు, మూడు సెల్‌ఫోన్లు, గడ్డపార, స్క్రూ డ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నకిరేకల్, కర్ణాటక రాష్ట్రంలోని హనుమాబాద్, మహబూబ్‌నగర్ రెండోటౌన్, కామారెడ్డి, అమన్‌గల్, వనపర్తి, వనపర్తి రూరల్, కేయూసీ వరంగల్‌లో కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎవరు నేరం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సైలు ఉస్మాన్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సింధూశర్మ

# కొనుగోళ్లను వేగిరం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్

ఇందల్వాయి, మే 21: రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్ వెల్లడించారు. చివరి గింజను సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉన్నదన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందల్వాయి సెంటర్‌లో 8691మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 8459 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని నిర్వాహకులు ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. ట్యాబ్ ఎంట్రీ సకాలంలో పూర్తయితేనే రైతులకు వేగంగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. కొనుగోలు కేంద్రానికి కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం తెచ్చిన ఓ రైతు ప్రత్యేకాధికారిని కలిసి గత మూడు రోజుల నుంచి తన ధాన్యాన్ని తూకం చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయి డీఎం జగదీశ్ ఉన్నారు.

**నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేయాలి..**

కామారెడ్డి, మే 21: జిల్లాలో ధాన్యం సేకరణ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు,ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు , రైస్‌మిల్లర్లతో మంగళవారం సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం రోజువారి లక్ష్యం నిర్దేశించుకొని కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ ప్రతి రోజు 9వేల మెట్రిక్ టన్నుల మేర, నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసేలా తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం, డీసీవో రమ్య, వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**కేంద్రాల పరిశీలన**

భిక్కనూరు మండలం అంతపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రత్యేకాధికారి పరిశీలించారు. సదాశివనగర్, బీబీపేట, రాజంపేట మండలాల్లోని పలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటా చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.




ఇందల్వాయిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్

# మళ్లీ దంచికొడుతున్న ఎండలు

ఉక్కపోతతో జనం అవస్థలు

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో** ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. వారం క్రితం చిరుజల్లులతోపాటు మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడ్డది. రెండు రోజుల నుంచి భానుడి ప్రతాపానికి ప్రజలు ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం వేళ అధిక ఉష్ణోగ్రతలతోపాటు వడగాలులు వీస్తున్నాయి. తీవ్రమైన ఎండకు తోడు ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్




మంగళవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ చౌరస్తా


ఎండవేడిమి నుంచి రక్షణగా స్కార్ఫ్ కట్టుకున్న యువతులు